సాక్షి
తిరుపతి
బుధవారం । 17 । సెప్టెంబర్ । 2025

నేత్రపర్వం.. తెప్పోత్సవం


తెప్పోత్సవాన్ని వీక్షిస్తున్న భక్తులు


తెప్పపై విహరిస్తున్న వరసిద్ధుడు (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో సిద్ధి,బుద్ధి వినాయకుడు

కాణిపాకం: ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి తెప్పపై విహరిస్తూ మంగళవారం కనువిందు చేశారు. ఉదయం మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకం, అనంతరం చందనాలంకారం చేసి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి సిద్ధిబుద్ధి సమేత స్వామివారి ఉత్సవమూర్తులను అస్థాటి మండపంలో ఉంచి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణ మధ్య స్వామివారిని వేంచేపుగా పుష్కరిణి వద్దకు తీకొచ్చారు. మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ స్వామి వారిని సర్వాంగసుందరంగా అలంకరించిన తెప్పపై ఆశీనులను చేశారు. స్వామివారు పుష్కరిణిలో తెప్పపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు.

పోటెత్తిన భక్తులు

తెప్పోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బ్రహ్మోత్సవ ఘట్టం చివరిది కావడంతో భక్తులు పోటెత్తారు. స్వామి దర్శనం కోసం క్యూలన్నీ నిండిపోయాయి. భకుల రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. తెప్పోత్సవంతో కాణిపాక వరసిద్ధుని ప్రత్యేక బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

న్యూస్‌రీల్

విమానాశ్రయంలో 'యాత్రసేవా దివస్' నేడు


మాట్లాడుతున్న ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ బూమినాథన్

ఏర్పేడు/రేణిగుంట : తిరుపతి విమానాశ్రయంలో బుధవారం 'యాత్ర సేవా దివస్' వేడుకలు నిర్వహించనున్నట్లు ఎయిర్‌పోర్టు డైరెక్టర్ బూమినాథన్ తెలిపారు. మంగళవారం రేణిగుంట సమీపంలోని ఎయిర్‌పోర్ట్‌లో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు తిరుపతి విమానాశ్రయంలో ప్రయాణికులతో కలసి ఈ సంబరాలు చేయబోతున్నట్లు తెలిపారు. రాష్ట్ర సాంస్కృతిక కళ ఉట్టిపడేలా తిరుపతి ఎస్వీ సంగీత కళాశాల విద్యార్థులతో నృత్య ప్రదర్శన, ఎయిర్‌పోర్ట్ ఆవరణలో ప్రయాణికులు, సీనియర్ సిటిజన్లతో మొక్కలు నాటించే కార్యక్రమం, తిరుపతి రోటరీ క్లబ్‌తో కలసి రక్తదాన శిబిరం, ప్రయాణికులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించి రక్త పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఆటో, టాక్సీ డ్రైవర్లకు ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పిల్లలకు క్విజ్, పెయింటింగ్ పోటీలు, ఫొటో, సెల్ఫీ బూత్‌లను ఏర్పాటు చేసి వారి ఫొటోలను, అభిప్రాయాలను తిరుపతి ఎయిర్‌పోర్ట్ అధికారిక సోషల్ మీడియా సైట్లలో పోస్ట్ చేస్తామన్నారు. సమావేశంలో ఎయిర్‌పోర్ట్ హెచ్‌ఆర్ సీనియర్ మేనేజర్ కశ్యప్, సీనియర్ టెర్మినల్ మేనేజర్ మణిదీప్, ఆపరేషన్స్ మేనేజర్ ప్రణయ్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి ఆలయ ఉద్యోగుల సస్పెన్షన్

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయ సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తూ ఈఓ బాపిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. స్కిట్ కళాశాల కోర్టు కేసుల వ్యవహారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించకపోవడంతో వారిపై చర్యలు తీసుకున్నట్లు జీవోలో పేర్కొన్నారు. దానివల్ల కోర్టు ధిక్కారణ కేసులు నమోదయ్యాయని ఈ నేపథ్యంలో దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేసి ఏఈవోకు మెమో ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా ఉన్న అధికారులపై చర్యలు లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆర్ సెట్ కన్వీనర్‌గా ఉష


ఆర్.ఉష, కన్వీనర్


జాన్ సుష్మా, కో కన్వీనర్

తిరుపతి రూరల్ : ఏపీ రీసర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఆర్ టెస్ట్) 2024 కన్వీనర్‌గా శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం బయో టెక్నాలజీ విభాగం ప్రొఫెసర్ ఆర్.ఉషను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఎంపిక చేసింది. అదే విభాగానికి చెందిన ప్రొఫెసర్ జాన్ సుష్మాను కో కన్వీనర్‌గా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులను జారీ చేసింది. ఆర్ సెట్ ద్వారా వివిధ సబ్జెక్టులలో పీహెచ్‌డీ ప్రోగ్రాంలో ప్రవేశానికి పరీక్షలను నిర్వహించనున్నారు. ఏపీ ఎస్‌హెచ్‌ఇ గుర్తింపు పొందిన ఏజెన్సీ ద్వారా ఆన్‌లైన్‌లో ఆ పరీక్షను నిర్వహించనున్నారు.

రైల్వే టికెట్ బుకింగ్‌లో మార్పులు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : ఆన్‌లైన్ రిజర్వేషన్ టికెట్ బుకింగ్ వ్యవస్థలో రైల్వేశాఖ సరికొత్త మార్పును తీసుకొచ్చింది. అక్టోబర్ 1 నుంచి ఆధార్ ధ్రువీకరణ పూర్తయిన వ్యక్తులు మాత్రమే రిజర్వేషన్ ప్రారంభమైన తర్వాత మొదటి 15 నిమిషాల్లో ఆన్‌లైన్ లో టిక్కెట్లు బుక్ చేసుకునే అవకాశం కల్పించనుంది. ఈ నియమం ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ రెండింటిలోనూ వర్తిస్తుంది. ప్రస్తుతం ఇది తత్కాల్ బుకింగ్ విధానంలో అమల్లో ఉంది. అక్టోబర్ 1 నుంచి సాధారణ రిజర్వేషన్లకు కూడా వర్తిస్తుందని రైల్వే అధికార వర్గాలు పేర్కొన్నాయి.

పార్లమెంటరీ విధానాలను బలోపేతం చేయాలి


సమీక్ష చేపడుతున్న కమిటీ ప్రతినిధులు, ఇతరులు

తిరుపతి కల్చరల్ : మెరుగైన పారదర్శకత, జవాబుదారీతనం కోసం పార్లమెంటరీ విధానాలను బలోపేతం చేయాలని పార్లమెంట్ సభ్యుడు, రాజ్యసభ కమిటీ చైర్మన్ డాక్టర్ లక్ష్మీకాంత్ బాజ్‌పాయ్ పిలుపు నిచ్చారు. మంగళవారం ఓ ప్రైవేటు హోటల్లో రాజ్యసభ కమిటీ అధ్యయన యాత్ర నిర్వహించారు. ఇందులో ఎంపీలు బహువా మాజీ, రాఘవ్‌చద్దా, రాంభాయ్ హెచ్, మోకారియా, నారాయణ కొరగప్ప, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈడీ సంజయ్ రుద్ర, సీఈవో అవినాష్ ప్రభు, తిరుపతి జోనల్ హెడ్ పత్రి శ్రీనివాసకుమార్, తిరుపతి డిప్యూటీ జోనల్ హెడ్ వీకే కిషోర్, సీనియర్ బ్యాంక్ అధికారులు, ఐఐటీ, తిరుపతి ఐఐఎస్‌ఈఆర్, సీఐసీ ,సంస్కృత వర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆడబిడ్డకు మరణశాసనం!



- శ్రీకాళహస్తికి చెందిన ఓ జంటకు గతేడాది వివాహం జరిగింది. గర్భం దాల్చడంతో కుటుంబ పెద్దల లింగ నిర్ధారణ పరీక్షల కోసం స్థాకంగా ఉన్న ఓ డాక్టర్‌ను సంప్రదించారు. తమకు తొలి సంతానం పురుషుడు కావాలని చెప్పారు. వెంటనే ఆ వైద్యుడు ఆమెకు పరీక్షలు నిర్వహించి కడుపులో పెరుగుతోంది బాలిక ఆనవాళ్లు అని నిర్ధారించి కుటుంబ సభ్యులకు చెప్పారు. దీంతో లింగ నిర్ధారణకు రూ. 45 వేలు, గర్భస్రావానికి సుమారు రూ. 35 వేలు దండుకున్నారు. ఈ విషయం బయటకు పొక్కడంతో అధికారులు ఆ డాక్టర్‌పై చర్యలు తీసుకున్నట్లు సమాచారం.
- నాయుడు పేటకు చెందిన ఓ జంటకు ఇప్పటికే ఇద్దరు బాలికలు పుట్టారు. తమకు వంశోద్ధారకుడు కావలంటూ మూడవసారి ప్రెగ్నెన్సీ కావడంతో లింగ నిర్ధారణ పరీక్షలు చేయించారు. దీంతో మూడవ సారి సైతం బాలిక పుట్టే ఆనవాళ్లు ఉన్నాయంటూ సంబంధిత పరీక్షా కేంద్రాలకు చెందిన డాక్టర్లు నిర్ధారించారు. దీంతో ఆమెకు గర్భస్రావం చేయాలని బంధువులు కోరారు. దీంతో పరీక్షించి డాక్టర్లు ఆ మాతృమూర్తి బంధువుల నుంచి వేలకు వేలు దండుకుని పని పూర్తి చేశారు.



అమ్మగా.. అక్కగా.. చెల్లిగా..అర్ధాంగిగా.. చెయ్యిపట్టి నడిపించే ఆడబిడ్డకు కడుపులోనే మరణ శాసనం లిఖిస్తున్నారు. ఆడపిల్ల భారమనుకునే రోజుల నుంచి ఆడబిడ్డ కోసం ఎదురుచూసే రోజులు వచ్చినా జిల్లాలోని కొన్ని మండలాల్లో ఆడపిల్లల లింగ నిష్పత్తి గణనీయంగా పడిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. భ్రూణ హత్యలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. లింగ నిర్ధారణ మాఫియా రెచ్చిపోతున్నా వైద్యశాఖ అధికారులు మామూళ్ల మత్తులోనే జోగుతుండడం విస్మయానికి గురిచేస్తోంది.

జిల్లాలో పెరుగుతున్న భ్రూణ హత్యలు

- రెచ్చిపోతున్న లింగ నిర్ధారణ మాఫియా
- ఆందోళనకరంగా బాలికల నిష్పత్తి
- శ్రీకాళహస్తిలో బాల, బాలికల నిష్పత్తి 1000 : 629కి పడిపోయిన వైనం
- గుట్టుచప్పుడు కాకుండా లింగ నిర్ధారణ పరీక్షలు
- తిరుపతి, శ్రీకాళహస్తి, నాయుడుపేట, గూడూరుల్లో శ్రుతి మించిన వ్యాపారం

సాక్షి ప్రతినిధి తిరుపతి : అయ్యో.. మాతృమూర్తుల కడుపులు చిదిమేస్తున్నారే... ప్రెగ్నెన్సీ అయిన నవ వధువులను సైతం వదలకుండా తొలి ప్రసవంలోనే మగబిడ్డ పుట్టాలంటూ స్కానింగ్ చేయించి రక్త ముద్దలపై దాడిచేసి హత్య చేస్తున్నారు. జిల్లాలో రోజు రోజుకు విచ్చలవిడిగా భ్రూణ హత్యలకు పాల్పడుతున్నా మామూళ్లకు అలవాటు పడ్డ ప్రభుత్వాధికారులు చోద్యం చూస్తున్నారు. దీంతో ఆధ్యాత్మిక నగరం తిరుపతితో పాటు, దేశంలోనే పేరొందిన శైవక్షేత్రం శ్రీకాళహస్తిలో సైతం బాలికల సంఖ్య రోజురోజుకు పడిపోతోంది. లింగనిర్ధారణ పరీక్షా కేంద్రాలు ధనార్జనే ధ్యేయంగా జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో విచ్చల విడిగా ఏర్పాటు చేసుకుని కోట్ల వ్యాపారం చేసుకుంటున్నారు. అధికారులకు ముడుపులు ముట్టచెప్పి లింగనిర్ధారణ పరీక్షల మాఫియా రెచ్చిపోతున్నా పట్టించుకున్న నాథుడు లేకపోవడంతో భ్రూణ హత్యలు రోజుకు పదుల సంఖ్యలో జరుగుతున్నాయన్నది జగమెరిగిన సత్యం. ఈ విషయంపై వైద్య శాఖలోని వైద్యాధికారులు, వైద్య సిబ్బంది సైతం పెద్ద ఎత్తున చర్చించుకుంటున్నారు,

వంశోద్ధారకుడు కావాలనే మూఢ నమ్మకం..

ముందు మగబిడ్డ పుడితే చాలు.. ఆ తర్వాత ఎవరూ పుట్టినా పర్వాలేదు. మళ్లీ మగ బిడ్డ పుడితే ఇంకా మేలే.. ఒకవేళ ఆడ బిడ్డ పుట్టినా.. కొడుకూ, కూతురు పుట్టిందని సంబర పడిపోతాం.. ఇదీ ప్రస్తుత సమాజంలో పిల్లలు కావాలంకుంటున్న తల్లిదండ్రుల పరిస్థితి. ముందు కొడుకు పుట్టి మరో సంతానంగా కూతురు పుడితే అక్కడితో ఆపేస్తున్నారు. అలా కాకుండా ముందు ఎంత మంది కూతుళ్లు పుట్టినా కొడుకు కోసం కొందరు ఆరాటపడుతున్నారు. ఇంకొందరు కొడుకుల కోసం ఆడ నలుసులను గర్భంలోనే నులిమేస్తున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే శ్రీకాళహస్తి ప్రాంతంలో వీధికో గాథ బయటపడుతోంది. ఇలా ఆడ నలుసు పురిటిలో కళ్లు కూడా తెరవకముందే భ్రూణ హత్యలకు గురవుతుంటే మరో పక్క కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారత అంటూ సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇకనైనా వైద్య శాఖ నిద్ర మేల్కొని లింగ నిర్ధారణ, గర్భ స్రావాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జిల్లాలో పడిపోతున్న బాలికల జనన రేటు

జనగణన 2018 ప్రకారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వెయ్యి మంది బాలురకు 922 మంది బాలికలు ఉన్నారు. అదే 2021 లెక్కలకొచ్చేసరికి ఈ సంఖ్య 901కి పడిపోయింది. జిల్లాల విభజన అనంతరం 2024లో జరిగిన జనగణన లెక్కల ప్రకారం తిరుపతి జిల్లాలో బాలికల సంఖ్య స్వల్పంగా పెరిగి 916కు చేరింది. అయితే శ్రీకాళహస్తిలో మాత్రం జిల్లా నిష్పత్తికి వ్యతిరేకంగా నానాటికీ బాలికల నిష్పత్తి తగ్గుతూ వస్తోంది. బాలురు – బాలికల నిష్పత్తిలో తీవ్ర వ్యత్యాసం నమోదైన ప్రాంతాలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అన్ని ప్రభుత్వ విభాగాలను భాగస్వామ్యం చేసి క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తేనే బాలికల నిష్పత్తి పడిపోకుండా ఆపగలమని మేధావులు సూచిస్తున్నారు. శ్రీకాళహస్తి ప్రాంతంలో తొలి సంతానం మగబిడ్డ పుట్టగానే కుటుంబ నియంత్రణ పాటిస్తున్న కుటుంబాలు ఎక్కువగా ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. లేకుంటే పిండ దశలోనే చిదిమేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

మొద్దునిద్రలో వైద్యాధికారులు

జిల్లాలో బాలురు- బాలికల నిష్పత్తి దారుణంగా ఉందన్న విషయాన్ని కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో సాక్షాత్తు జిల్లా కలెక్టరే ఈ అంశాన్ని బహిర్గతం చేయడం గమనార్హం. ఆరేళ్లలోపు బాలల్లో బాలికలు అతి తక్కువగా ఉన్న మండలాల్లో తొట్టంబేడు, శ్రీకాళహస్తి, ఏర్పేడు ఉన్నట్లు సమాచారం. మూడు నెలల కిందట స్థానిక ఆర్డీవో కార్యాలయంలో జరిగిన అడ్వయిజరీ కమిటీ సమావేశంలో సైతం ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి ఇదే అంశాన్ని లేవనెత్తారు. అయినా వైద్యాధికారుల్లో ఎలాంటి చలనం లేకపోవడంతో పెద్ద ఎత్తున భ్రూణ హత్యలు చోటు చేసుకున్నట్లుగా ఆరోపణలు వస్తున్నాయి. గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ లింగ ఎంపిక నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్న నిబంధనను అధికార యంత్రాంగం ఆచరణలో పెట్టకపోవడంతో ఆడ నలుసు అమ్మ గర్భంలోనే అంతమైపోయే పరిస్థితి ఏర్పడింది. తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఆడ-మగ నిష్పత్తి వెయ్యికి తొమ్మిది వందలు ఉండగా శ్రీకాళహస్తిలో మాత్రం వెయ్యికి 629 మందే ఆడ బిడ్డలే ఉండటం ఇందుకు నిలువెత్తు సాక్ష్యం.

రూ.కోట్లలో వ్యాపారం



లింగ నిర్ధారణ పరీక్షలు అత్యంత రహస్యంగా నిర్వహిస్తున్నారు. దళారులు గర్భిణులను, సంబంధీకులను గుట్టుగా తిరుపతి, గూడూరు తీసుకెళ్తున్నారు. అక్కడికి వెళ్లాక ఒప్పందం కుదుర్చుకున్న ఆసుపత్రికి సమాచారం అందిస్తారు. గర్భిణీతో ఎక్కువ మంది రాకుండా, ఆమెతో పాటు మరొకరిని వెంటబెట్టుకుని ప్రత్యేక వాహనంలో తరలిస్తారు. ఆస్పత్రి పేరుగానీ, చిరునామాగానీ ఎలాంటివి చెప్పకుండానే తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించి పుట్టబోయేది ఆడ.. మగ చెప్పి రిపోర్టులు చేతికి ఇవ్వకుండా పంపేస్తున్నారు.

విచ్చలవిడిగా లింగనిర్ధారణ పరీక్షలు



పేదల మూఢ నమ్మకాలను ఆసరాగా చేసుకుని శ్రీకాళహస్తి, నాయుడుపేట, గూడూరుల్లో.. లింగ నిర్ధారణ పరీక్షల నిర్వాహకులు భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారు. శ్రీకాళహస్తి ప్రాంతంలో బాలికల నిష్పత్తి లింగ నిర్ధారణ పరీక్షల కారణంగానే గణనీయంగా తగ్గిపోతుందన్న విమర్శలు వస్తున్నాయి. శ్రీకాళహస్తి పట్టణంలోని కొన్ని స్కానింగ్ కేంద్రాలు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లుగా ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కో లింగ నిర్ధారణ పరీక్షకు రూ. 15 నుంచి రూ. 20 వేలు ఫీజులు తీసుకుంటున్నట్లుగా చెప్పుకుంటున్నారు. అదేవిధంగా నాయుడుపేట, గూడూరు కేంద్రంగా లింగ నిర్ధారణ పరీక్షలు పెద్ద ఎత్తున జరుగుతున్నట్లు సమాచారం. గూడూరు పట్టణంలోని పేరుగాంచిన ఓ ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు విచ్చలవిడిగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వైద్యులు, స్కానింగ్ కేంద్రాలు నడుపుతున్న నిర్వాహకులు లింగ నిర్ధారణ పరీక్షల పేరుతో కోట్లు గడిస్తున్నారని చెప్పుకుంటున్నారు. ఆ ఫలితమే భ్రూణ హత్యలకు కారణమవుతున్నాయని అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్య యంత్రాంగం అప్రమత్తమై ప్రైవేటు నర్సింగు హోముల్లో, స్కానింగ్ సెంటర్లలో విరివిగా తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

గర్భస్రావాలకు ప్రత్యేక ధర

లింగ నిర్ధారణ స్కానింగ్ కోసం సుమారు రూ.25 నుంచి రూ. 30 వేలు వసూలు చేస్తుండగా గర్భస్రావం చేయించేందుకు మరో రేటు తీసుకుంటున్నారు. తిరుపతిలో అయితే రూ.25 వేలు, గూడూరు, శ్రీకాళహస్తి, నాయుడుపేట ఇతర ఆసుపత్రుల్లో రూ.20 వేలు తీసుకుంటున్నట్లు తెలిసింది. కొన్ని ఆసుపత్రులు ఈ దందాను గుట్టుగా సాగిస్తున్నాయి. గర్భం దాల్చిన 20 వారాల తర్వాత గర్భ విచ్ఛిత్తి చేయడం అత్యంత ప్రమాదకరం. అందుకే ప్రభుత్వాలు కఠిన నిబంధనలు, చట్టాలు తీసుకొచ్చాయి. కొందరు ధనార్జన కోసం ఇష్టారీతిగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. లింగ నిర్ధారణ పరీక్షలతో గర్భస్రావాలు ఎక్కువగా చేస్తున్నారు. ఈ ప్రభావం లింగ నిష్పత్తిపై పడుతోంది. ముఖ్యంగా గూడూరు, తిరుపతి నగరాల్లో ప్రసూతి ప్రైవేటు ఆసుపత్రుల కేంద్రంగా ఈ దందా సాగుతున్నట్లుగా ఆరోపణలు వస్తున్నాయి.

కేసులు నమోదు చేస్తాం

జిల్లా కలెక్టర్ ఆదేశాలతో దీనిపైన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నాం. ఈ కమిటీలో స్పెషలిస్ట్ డాక్టర్లు జిల్లా అధికారులు నియోజకవర్గ స్థాయి వైద్యాధికారి ఈ కమిటీలో ఉంటారు. సమగ్రంగా దీనిపైన విచారించి ఒక నెల రోజుల్లో కలెక్టర్ కు నివేదిక సమర్పిస్తాం. గతంలో ఈ విధంగా స్కానింగ్ చేస్తూ దొరికిన ఓ ప్రైవేటు ఆసుపత్రిని సీజ్ చేసి మిషన్లు కూడా స్వాధీనం చేసుకున్నాం. వారిపై కేసులు నమోదు చేయడం జరిగింది. తప్పు చేసినట్టు తెలిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తాం. – డాక్టర్ బాలకృష్ణ నాయక్, డీఎంహెచ్‌ఓ, తిరుపతి

హామీలను విస్మరించిన కూటమి

- ముస్లిం, మైనార్టీల సంక్షేమమే లక్ష్యంగా గత జగనన్న పాలన
- వైఎస్సార్‌సీపీ ముస్లిం, మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్‌బాషా


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ముస్లిం, మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్‌బాషా, చిత్రంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూమన కరుణాకర రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి మంగళం : ఏడాదన్నరకాలం అవుతున్నా ముస్లింలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా చంద్రబాబు మోసం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ముస్లిం, మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్‌బాషా మండిపడ్డారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం పార్టీ ముస్లిం, మైనార్టీ విభాగం జిల్లా సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాదర్‌బాషా మాట్లాడుతూ.. తండ్రికి తగ్గ తనయుడిగా ఐదేళ్ల జగనన్న పాలన ముస్లిం, మైనార్టీల సంక్షేమ పాలనగా సాగిందన్నారు. వక్ఫ్‌బోర్డు ఏర్పాటుతో పాటు షాదీ మహల్లకు చైర్మన్లను నియమించారన్నారు. అనేక సంక్షేమ పథకాలతో ముస్లింల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. అయితే గత ఎన్నికల్లో కూటమి నాయకులు నోటికి వచ్చిన అబద్ధపు హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చి ఏడాదన్నరకాలం అవుతున్నా ముస్లింలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా చంద్రబాబు మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ.. జగనన్న పాలనలోనే ముస్లింలకు ఉన్నత స్థానం దక్కిందన్నారు. జగనన్న సాకారంతో తిరుపతిలో ముస్లింలను కార్పొరేటర్లుగా, కో-ఆప్షన్ సభ్యులుగా, షాదీమహల్ చైర్మన్లుగా, నామినేటెడ్ పదవుల్లో మొదటి స్థానం కల్పించిన ఘనత తమదేనని సగర్వంగా చెప్పారు. చంద్రబాబు హామీలు ఇవ్వడం తప్ప వాటిని అమలు చేసిన దాఖలాలే లేవన్నారు. రాబోయే ఎన్నికల్లో ముస్లిం, మైనార్టీలంతా జగనన్నను తిరిగీ ముఖ్యమంత్రిగా చేసుకోవడం కోసం అహర్నిశలు శ్రమిద్దామని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, తిరుపతి, సత్యవేడు సమన్వయ కర్తలు భూమన అభినయ్‌రెడ్డి, నూకతోట రాజేష్, పార్టీ ముస్లిం, మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ సయ్యద్ షఫీ అహ్మద్ ఖాదరీ, నగర అధ్యక్షుడు మహ్మద్ కాసీమ్ బాషా(చోటాబాయ్), కార్పొరేషన్ కో-ఆప్షన్ సభ్యులు రాజేశ్వరి, ఖాదర్‌బాషా, ముస్లిం నాయకులు షేక్ ఇమామ్ బాషా, షేక్ ఇమ్రాన్ బాషా, గఫూర్, చాంద్‌బాషా, సలీం, షర్మిలతో పాటు జిల్లాలోని నియోజకవర్గాల ముస్లిం నాయకులు పాల్గొన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.1,14,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.1,0,260

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.1,33,800
రిటైల్ వెండి గ్రాము	రూ.136.80

పత్రికా స్వేచ్ఛను కాపాడాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛ కరువైంది. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తున్న పత్రికలపైన, పత్రికా విలేకరులపై ఈ మధ్య కాలంలో అనేక కేసులు బనాయిస్తున్నారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పత్రికల ద్వారా ప్రభుత్వానికి, అధికారులకు తెలియజేస్తున్న జర్నలిస్టులపై ఉక్కుపాదం మోపి దాడులు చేయడం అన్యాయం. అక్రమ కేసులు బనాయించడం రాజ్యాంగ విరుద్ధం. రాజ్యాంగంలోని వాక్ స్వాతంత్ర్యాన్ని కాలరాయడం కరెక్టు కాదు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలి. పెట్టిన కేసులను ఎత్తివేయాలి.

– శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి



ప్రశ్నించే గొంతుకపై కక్ష



ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడడం అన్యాయం. ఒక నాయకుడు ప్రెస్‌మీట్‌లో చెప్పిన అంశాలను ప్రచురిస్తే మీడియాపై కేసులు పెట్టడం విడ్డూరంగా ఉంది. ఇలా కేసులు నమోదు చేయడం మంచి పద్ధతి కాదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా స్వేచ్ఛపై గౌరవభావం కలిగి ఉండాలి. భయపెట్టి నిజాలను కప్పివేయాలనుకోవడం సరికాదు. పత్రికా స్వేచ్ఛకు, వాక్‌స్వాతంత్ర్యపు హక్కుకు సంకెళ్లు ఎలా వేస్తారని ప్రశ్నిస్తున్నా?. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించే ధోరణిని మానుకోవాలి. అన్యాయంగా పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలి.

– చైతన్య, విద్యుత్ వినియోగదారుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

బైక్ దొంగలు అరెస్టు



పట్టుబడిన బైకులను చూపుతున్న సీఐ, ఎస్ఐ

తడ: మండలంలో తరచూ జరుగుతున్న ద్విచక్ర వాహనాల చోరీకి సంబంధించి పోలీసులు మంగళవారం ఐదుగురు నిందితులను అరెస్టు చెయ్యడంతో పాటు 11 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ మంగళవారం తడ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఇటీవల తడలో పట్టుబడిన కొన్ని ద్విచక్ర వాహనాలకు సంబంధించి విచారణలో భాగంగా తనిఖీలు నిర్వహించిన పోలీసులకు నిందితుల ఆచూకీ లభించింది. ఆ మేరకు తడ ఎస్ఐ కొండపనాయుడు ఆధ్వర్యంలో వలపన్నిన పోలీసులు ఇప్పటికే రౌడీ షీటర్‌గా ఉన్న సాయి విగ్నేష్‌తో పాటు తడ చుట్టుపక్కల గ్రామాలకు చెందిన రాకేష్, గోపాల్, మునిశేఖర్, సూర్యనారాయణ అనే నిందితులను అరెస్టు చేసి వారివద్ద నుంచి విక్రయానికి సిద్ధంగా ఉన్న, ఇప్పటికే విక్రయించిన మరికొన్ని బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీరికి సహకరించిన వంశీతో పాటు మరో వ్యక్తి ఇప్పటికే మరో కేసులో నెల్లూరు జైలులో ఉన్న నేపథ్యంలో ప్రస్తుతానికి ఈ ఐదు మందిని అరెస్టు చేసినట్టు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ కొండపనాయుడు, ఏఎస్ఐ శ్రీకుమార్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

డీసీఎంఎస్ చైర్మన్ మృతి



పల్లినేని సుబ్రమణ్యం నాయుడు (ఫైల్)

చంద్రగిరి : తిరుపతి, చిత్తూరు జిల్లాల డీసీఎంఎస్ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత పల్లినేని సుబ్రమణ్యం నాయుడు (51) అనారోగ్యంతో చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని చెన్నైకు చేరుకుని, మృతదేహాన్ని స్వగ్రామం పనపాకం పంచాయతీ గడ్డంవారిపల్లికు మంగళవారం మధ్యాహ్నం తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆటో బోల్తా : ఆరుగురికి గాయాలు

శ్రీకాళహస్తి : పట్టణంలోని భరద్వాజ తీర్థం వద్ద ఆటో బోల్తా పడి ఆరుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. నెల్లూరుకు చెందిన కుటుంబ సభ్యులు శ్రీకాళహస్తిలో బంధువుల ఇంటికి జన్మదిన వేడుకలు కోసం వచ్చారు. వేడుకల అనంతరం లోబావి (భరద్వాజతీర్థం) సందర్శించి తిరుగు ప్రయాణం అయ్యారు. ఇంతలో కన్నప్ప కొండ వద్ద ఆటో అదుపు తప్పడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో రెహనా (50), కరిష్మా (22), భాను (23), జాకీర్ (23), ఆశా బేగం (65), మహమ్మద్ అలీ (8) గాయాలయ్యాయి. వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు చేయిస్తున్నారు.

ఆచూకీ పట్టించిన మందుల చీటీ



పాతిపెట్టిన చిన్నారుల మృత దేహాలను వెలికి తీయడానికి తవ్వుతున్న దృశ్యం



మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించడానికి వెళ్లిన వైద్యులు, అధికారులు

- అడవిలో బయటపడ్డ మృతదేహాల గుర్తింపు
- మృతులు తమిళనాడుకు చెందిన నాగపట్నం జిల్లా వాసులు
- భార్య, బిడ్డల మృతదేహాలను చూసి కుప్పకూలిన భర్త వెంకటేష్
- ఆత్మహత్యా? హత్యా? అనే కోణంలో కొనసాగుతున్న విచారణ



అడవిలో మృతదేహాల వద్ద మృతురాలి కుటుంబీకులు

పాకాల:అడవిలో బయటపడ్డ మృతదేహాల ఆచూకీ మెడికల్ ప్రిస్క్రిప్షన్‌తో బహిర్గతమైంది. నాలుగు మృతదేహాలు ఎవ్వరివి అన్న మిస్టరీ వీడింది. మృతులు తమిళనాడు రాష్ట్రం నాగపట్నం జిల్లా పి.కొంతగై గ్రామానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించి మృతుల కుటుంబీకులకు సమాచారం అందించారు. వివరాలు ఇలా.. నాయుడుపేట- పూతలపట్టు జాతీయ రహదారిపై గాదంకి టోల్ ప్లాజాకు ఆనుకుని 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న మూలవంక అటవీ ప్రాంతంలో ఈనెల 14వ తేదీన బయటపడ్డ నాలుగు మృతదేహాలను పోలీసులు గుర్తించారు. అడవిలో మృతి చెందిన మహిళ భర్త వెంకటేష్ మంగళవారం పాకాల పోలీస్ స్టేషన్ చేరుకుని తన భార్య బిడ్డలు కనిపించడం లేదని వారి ఫొటోలతో పాటు వివరాలను స్థానిక పోలీసులకు అప్పగించారు. అనంతరం వెంకటేష్‌ను వెంట బెట్టుకుని అడవిలోకి వెళ్లిన పోలీసులు అక్కడ పాతిపెట్టిన గోతులను తవ్వించి అందులో ఉన్న పిల్లల మృతదేహాలను చూపించారు. తన కుమార్తెలు దర్శిని (9), వర్షిణి(3)గా నిర్ధారించుకున్న వెంకటేష్ కన్నీటి పర్యంతమై అక్కడే కుప్పకూలిపోయాడు. పోలీసులు అతడిని ఓదార్చి ధైర్యం చెప్పి ఆ తరువాత పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలను పాతిపెట్టిన గోతుల్లో మృతదేహాలతో పాటు ఒక సెల్‌ఫోన్, ఆధార్, పాన్ కార్డులు, చాక్లెట్లు బయటపడగా వాటి ఆధారంగా తన భార్య జయమాల, ఆమె సోదరుడు కళై సెల్వంగా వెంకటేష్ గుర్తించాడు.

చీటీ ఆధారంగా చిరునామా గుర్తింపు

నాలుగు మృతదేహాల మిస్టరీ ఛేదించడంలో మెడికల్ ప్రిస్క్రిప్షన్ కీలకమైంది. అడవిలోని మృతదేహాల వద్ద లభించిన హాస్పిటల్ ప్రిస్క్రిప్షన్ ఆధారంగా పోలీసులు హాస్పిటల్ ఫోన్ నంబర్‌కి ఫోన్ చేసి వివరాలు తెలిపారు. తంజావూరులోని ఆసుపత్రి వారు అక్కడి మెడికల్ రికార్డుల్లోని చిరునామా ఆధారంగా వారి కుటుంబ సభ్యులకు సమాచారాన్ని చేరవేశారు. ఆ విషయం తెలుసుకున్న వెంకటేష్ పాకాల పోలీస్ స్టేషన్ కు చేరుకుని తన భార్య, పిల్లల ఫొటోలను చూపించగా అతడిని ఘటనా స్థలికి తీసుకువెళ్లి నిర్ధారణ చేసుకున్నారు.

అసలేం జరిగిందంటే..?

జయమాల భర్త వెంకటేష్ కువైట్లో పనిచేస్తుండగా జయమాల తన ఇద్దరు పిల్లలు దర్శిని (9), వర్షిణి (3)లతో పి.కొంతగై గ్రామంలోనే ఉండేవారు. కువైట్ నుంచి అప్పుడప్పుడూ రూ.50 వేలు, రూ.60 వేలు తన భార్య జయమాలకు పంపించేవారు. ఆ డబ్బును జయమాల తన పెద్దమ్మ కుమారుడైన కళై సెల్వంతో కలిసి ఫైనాన్స్ చేస్తుండేది. ఆ ఫైనాన్స్ వ్యాపారంలో డబ్బులు పోగొట్టుకుని పూర్తిగా నష్టపోయారు. ఈ క్రమంలో వెంకటేష్ 2024 జూన్ నెలలో కువైట్ నుంచి ఇంటికి వచ్చాడు. అదే రోజున తన భార్య జయమాలను తాను పంపించిన డబ్బులు ఏం చేశావని అడిగ్గా జయమాల దగ్గర నుంచి ఎలాంటి సమాధానం రాక పోవడంతో గొడవపడి అతడు తిరిగి కువైట్‌కు వెళ్లిపోయాడు. 2025 జూలై నెలలో తన భార్య పిల్లలు కనిపించడం లేదని విషయం తెలుసుకున్న వెంకటేష్ కువైట్ నుంచి స్వగ్రామానికి వచ్చి బంధువులు, స్నేహితులను విచారించాడు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో తన భార్య, పిల్లలు కనిపించడం లేదని నాగపట్నం జిల్లా తిక్కచేరీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అక్కడి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

ఇక్కడకి ఎలా వచ్చారు?

ఎక్కడో నాగపట్ల జిల్లా నుంచి పనపాకం సమీపంలోని అడవుల్లోకి ఎలా వచ్చారు.. ఎలా చనిపోయారు అనే విషయంలో నెలకొన్న అనుమానాలు మాత్రం తీరడం లేదు. తమ వెంట తీసుకొచ్చిన పిల్లలను చంపి పాతిపెట్టిన తరువాత వారు ఆత్మహత్య చేసుకున్నారా..? లేదా ఫైనాన్స్ గొడవల్లో ఎవ్వరైనా ఆ నలుగురుని కిడ్నాప్ చేసి చంపి అడవిలో ఆత్మహత్యలా చిత్రీకరణ చేశారా..? జయమాల, కళై సెల్వన్‌ల మృత దేహాల మూతులకు గుడ్డలు కట్టి ప్లాస్టర్ వేసి ఉన్నందున హత్య చేశారన్న అనుమానాలకు బలం చేకూరుతోంది. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నందున త్వరలో నిజాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.

మృతదేహాలకు అక్కడే శవపరీక్ష, ఖననం

అడవిలో నుంచి మృత దేహాలను కదిలించలేని దుస్థితిలో ఉన్నందున పోలీసులు తహసీల్దారు సమక్షంలో వైద్యులను తీసుకువెళ్లి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యుల సమక్షంలో పంచనామా నిర్వహించి ఖననం చేశారు. అసలు ఆ కుటుంబంలో జయమాల, కళై సెల్వంల మధ్యన సంబంధాలు ఏమిటి అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు కూటమి కుట్రలు



సమావేశంలో మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి

- 19న మదనపల్లె మెడికల్ కళాశాల వద్ద నిరసన
- పార్టీ శ్రేణులు తరలిరావాలని భూమన అభినయ్‌రెడ్డి పిలుపు



సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు, నేతలు

తిరుపతి మంగళం : పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్ రెడ్డి ఆరోపించారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసి పేదలకు ఉచిత వైద్య విద్యను అందించేందుకు ఎంతో కృషి చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు అందిస్తానన్న సంక్షేమ పథకాలు అందించకపోగా, పేద విద్యార్థుల కోసం నిర్మిస్తున్న మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు చంద్రబాబు కుట్రలు చేస్తున్నారన్నారు. పేదలకు ద్రోహం చేస్తూ సంపన్నులకు దోచిపెట్టడమే చంద్రబాబు పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మెడికల్ కళాశాలలు ప్రైవేటు పరం కాకుండా వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ పిలుపు మేరకు మదనపల్లి వద్ద జగనన్న నిర్మించిన మెడికల్ కళాశాల ప్రైవేటు పరం కాకుండా ఈనెల 19న మదనపల్లి మెడికల్ కళాశాల వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులు నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్లు, పార్టీ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీని సందర్శించిన థాయిలాండ్ బృందం



తిరుపతిలోని మహిళా యూనివర్సిటీలో థాయిలాండ్ వర్సిటీ బృందం

తిరుపతి రూరల్ : శ్రీపద్మావతీ మహిళా యూనివర్సిటీని థాయిలాండ్‌లోని ప్రిన్స్ ఆఫ్ సాంగ్‌క్లా యూనివర్సిటీ పట్టాని క్యాంపస్ ప్రతినిధి బృందం మంగళవారం సందర్శించింది. యూనివర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ వి.ఉమ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజని, అంతర్జాతీయ సంబంధాల విభాగం డీన్ ప్రొఫెసర్ పి.విజయలక్ష్మి, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ ఆర్.ఉష విదేశీ బృందానికి స్వాగతం పలికారు. అనంతరం రెండు విశ్వ విద్యాలయాల అధ్యాపకుల మధ్య సమగ్ర చర్చలు జరిగాయి. ఇందులో సంయుక్త పరిశోధన, సామూహిక ప్రచురణలు (జాయింట్ పబ్లికేషన్), విద్యార్థుల , అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలపై చర్చించారు. అంతర్జాతీయ విద్యా ప్రమాణాల పరిశీలన, పరస్పర సహకారం కోసం ప్రత్యేక సమావేశాన్ని యూనివర్సిటీ అధికారులు నిర్వహించారు. రెండు విశ్వవిద్యాలయాల మధ్య విద్యా, పరిశోధన సహకారాన్ని అభివృద్ధి చేయడమే ప్రధాన ఉద్దేశంగా ఆ సమావేశం సాగింది. మహిళల సాధికారత కోసం చేస్తున్న సేవలను ప్రశంసించడంతో పాటు ఈ తరహా కార్యక్రమాలను థాయిలాండ్‌లోనూ అమలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. చివరగా రెండు యూనివర్సిటీల మధ్యన ఒప్పందాలకు అంగీకారం కుదుర్చుకున్నట్టు వీసీ వి.ఉమ స్పష్టం చేశారు.

యోగా మాస్టర్‌ను బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు

తిరుపతి రూరల్ : ట్రేడింగ్ యాప్‌లతో సైబర్ నేరగాళ్లు ఓ యోగా మాస్టర్ వద్ద రూ.11.99 లక్షలు కాజేశారు. పోలీసుల సమాచారం మేరకు.. పేరూరులో నివాసం ఉంటున్న యోగా టీచర్‌కు వాట్సాప్ ద్వారా లింకును పంపిన హేమాంగి డేట్ అనే వ్యక్తి ప్రముఖ ఐసీఐసీఐ సెక్యూరిటీ పేరుతో గల నకిలీ ట్రేడింగ్ యాప్‌లో ఇన్వెస్ట్ చేయమని ప్రలోభపెట్టారు. అతడి మాటలు నమ్మిన యోగా మాస్టర్ అతను చెప్పినట్టు అంతా చేసి కొంత డబ్బులు ఇన్వెస్ట్ చేసిన తరువాత కొద్ది రోజులకు లాభాలు చూపించి ఆ డబ్బులు విత్ డ్రా చేసుకోవాలంటే 20 శాతం కమిషన్ ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. అనుమానం వచ్చి ఐసీఐసీఐ బ్యాంకును సంప్రదించగా ఆ యాప్ ఫేక్ అని తెలుసుకున్న బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. అప్పటికే రూ. 11.99 లక్షలు అందులో జమ చేసినట్టుగా 1930 ద్వారా సైబర్ క్రైం పోలీసులకు సమాచారం అందించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు మంగళవారం క్రైమ్ నెంబర్ 488/2025 కేసుగా ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేసినట్టు తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందు తెలిపారు.

హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడిగా మహేష్



మహేష్‌ను ఎన్నిక చేసినట్లు ధ్రువీకరణ పత్రం అందించిన ఆ సంఘం నేతలు

నాయుడుపేటటౌన్ : ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ ఇండియా హ్యూమన్ రైట్స్ తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా నాయుడుపేటకు చెందిన మావృక్షపాటి మహేష్‌ను ఎన్నిక చేసినట్లు తెలిపారు. గూడూరు పట్టణంలో మంగళవారం ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ ఇండియా హ్యూమన్ రైట్స్ దక్షిణ భారత దేశ పౌర హక్కుల అవగాహన సదస్సులో ఆ సంఘ నాయకులు మహేష్‌ను జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక చేసినట్లు తెలిపారు.

టీచర్లకు బోధనేతర పనులు వద్దు



రణభేరిని ప్రారంభిస్తున్న యూటీఎఫ్ నాయకులు

- ప్రభుత్వంపై యూటీఎఫ్ 'రణభేరి'

తిరుపతి సిటీ: స్కూళ్లలో టీచర్లకు విపరీతంగా పెరిగిపోయిన బోధనేతర పనులను రద్దు చేసి వారి సమయాన్ని బోధనకే పరిమితం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానికంగా ఓ హోటల్‌లో యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తలపెట్టిన రణభేరి–ప్రచార బైక్ జాతా నిర్వహించి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 13 వేలకు పైగా పాఠశాలలు ఏకోపాధ్యాయులతో నడుస్తున్నాయని, ఒక ఉపాధ్యాయుడు ఐదు తరగతులకు బోధన చేయడమే ఇబ్బందిగా ఉన్న పరిస్థితుల్లో, పలు రకాల బోధనేతర పనులను అప్పగించడం దారుణమని, ఆ పనులను వివరించారు. వీటి నుంచి విముక్తి కల్పించి స్వేచ్ఛాయుత వాతావరణంలో పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించడానికి అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, తిరుపతి, చిత్తూరు జిల్లాల ప్రధాన కార్యదర్శులు ముత్యాల రెడ్డి, మణిగంఠన్, దేవరాల నిర్మల, జిల్లా గౌరవాధ్యక్షులు దండు రామచంద్రయ్య, వయ్యాల మధు, బండి మధుసూదన్ రెడ్డి, అవనిగడ్డ పద్మజ, మోహన్, చీళ్ల సురేష్, హేమాద్రిబాబు,వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ అనుమానాస్పద మృతి

రేణిగుంట : కర్ణాటక రాష్ట్రం కొప్పల్ జిల్లాకు చెందిన మహబూబ్(30) అనే లారీ డ్రైవర్ రేణిగుంట మండలంలోని కేఎల్ఎం హాస్పిటల్ సర్కిల్ సమీపంలోని అశోక్ లైలాండ్ సర్వీస్ పాయింట్ వద్ద అనుమానాస్పదంగా మృతి చెందినట్లు గాజుల మండ్యం ఎస్ఐ సుధాకర్ తెలిపారు. సోమవారం తెల్లవారుజామున డ్రైవర్ మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం కోసం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నాయుడుపేటలో నిలిచిన పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు

– తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు



నాయుడుపేట స్టేషన్‌లో నిలిచిపోయిన పినాకిని ఎక్స్‌ప్రెస్ రైలు

నాయుడుపేటటౌన్ : నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో మంగళవారం పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిచి పోయి ఆలస్యంగా నడిచాయి. విజయవాడ నుంచి చెన్నైకు వెళుతున్న పినాకిని ఎక్స్‌ప్రెస్ రైలు మంగళవారం మధ్యాహ్నం గంట పాటు నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో నిలిపి వేశారు. తడ సమీపంలో రైల్వే బ్రిడ్జి వద్ద రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు చేస్తుండడంతో పలు రైళ్లను గూడూరు, నాయుడుపేట, దొరవారిసత్రం రైల్వే స్టేషన్‌లలో నిలిపేశారు. బ్రిడ్జి వద్ద రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు పూర్తి చేసి మంగళవారం మధ్యాహ్నం 12 గంటల తరువాత రైళ్లు ఒకే ట్రాక్‌పై రాకపోకలు జరిపాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వచ్చే ఏడాది జాతీయ స్థాయి ఖో-ఖో పోటీలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ, అధికారులు

తిరుపతి సిటీ: వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జాతీయ స్థాయి ఖో–ఖో పోటీలకు ఎస్వీయూ ఆతిథ్యమిస్తున్నట్టు వీసీ అప్పారావు తెలిపారు. మంగళవారం వీసీతోపాటు పలు డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, పీడీ ప్రొఫెసర్ శివశంకర్‌రెడ్డి ఖో–ఖో పోటీల పోస్టర్లను ఆవిష్కరించారు.

గుట్టుగా రైతుల భూములు టీడీపీ నేతల పరం!

- నిలదీసిన రైతులపై చిందులేసిన తహసీల్దార్
- ఆర్డీఓ వద్ద తేల్చుకోవాలంటూ ఉచిత సలహా
- అంతటితో ఆగక బాధితుల్ని పోలీసులకు అప్పగించిన వైనం
- తహసీల్దార్ తీరుపై మండిపడుతున్న రైతు నేతలు



పోలీసులు తమ అదుపులోకి తీసుకున్న బాధిత రైతులు



భూముల పత్రాలను కార్యాలయం వద్ద చూపుతున రైతులు

కేవీబీపురం: తమకు అధికారులు అన్యాయం చేసారని తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన బాధిత రైతులను సాక్షాత్తు తహసీల్దారే పోలీసులకు అప్పగించి వేధింపు చర్యలకు పాల్పడడం చర్చనీయాంశమైంది. వివరాలు..మండలంలోని తిమ్మసముద్రం గ్రామానికి చెందిన రైతులు రమణయ్య నాయుడు, చెంచు కృష్ణారెడ్డి, వెంకటమునికి స్థానికంగా పట్టా భూమి కలిగి ఉన్నారు. ఆ భూమిలో దాదాపు 3 దశాబ్దాలుగా వ్యవసాయం చేస్తున్నారు. అయితే గత నెల వరకూ రైతుల పేరిటే ఉన్న ఆ భూములు ఈ నెల 2వ తేది తరువాత స్థానిక టీడీపీ నేతల పేరిట మారిపోయాయి! ఇది తెలుసుకున్న బాధిత రైతులు అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోవడంతో మీడియాను ఆశ్రయించారు. మీడియా వారి సమస్యను గత శనివారం వెలుగులోకి తెచ్చింది. ఈ నేపథ్యంలో మంగళవారం బాధితులు తహసీల్దార్ రోశయ్య, వీఆర్ఓ మనోహర్‌ను నిలదీశారు. దీంతో వారు రైతులపై చిందులేశారు. ఏమైనా ఉంటే ఆర్‌డీఓ దగ్గర తేల్చుకోవాలని, మీడియాను ఎవరు కలవమన్నారంటూ ఎదురుదాడికి దిగారు. అంతటితో ఆగకుండా జరుగుతున్న తతంగాన్ని సెల్‌ఫోన్‌లో రికార్డు చేస్తున్నారనే నెపంతో రైతు వెంకటముని కుమారుడైన మునిరత్నం ఫోన్‌ను తహసీల్దార్ బలప్రయోగంతో లాక్కున్నారు. అంతటితో ఆగకుండా వారిని తహసీల్దార్ పోలీసులకు అప్పగించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారిని సాయంత్రం వరకు అక్కడే ఉంచారు. తహసీల్దార్ తమ భూములను భూములను టీడీపీ నేతలకు అప్పగించడమే కాకుండా, తమను బెదిరించడం శోచనీయమని, దీనిపై ఆర్డీఓ, జిల్లా కలెక్టర్ దృష్టి సారించి తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు విజ్ఞప్తి చేశారు.

సీఎం చెప్పేదొకటి..ఆచరణలో మరొకటి

ఇదలా ఉంచితే, రైతుల ప్రమేయం లేకుండా వారి భూములను రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అధికార పార్టీ నేతలకు అప్పగించడం వెనుక రెవెన్యూ అధికారుల హస్తం ఉన్నట్టు స్పష్టంగా తేలుతున్నా , పుండు మీద కారం చల్లినట్లు బాధితులనే వేధించడం విమర్శలకు తావిచ్చింది. రైతులను రారాజు చేయడమే తన లక్ష్యమని సీఎం చంద్రబాబునాయుడు ఆర్భాటంగా ప్రకటించినా, రైతుల కడుపు కొట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం, నాయకుల తీరు ఉంటోందని పలువురు రైతు నాయకులు విమర్శించారు.